సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 8 । ఆగస్టు । 2024



ఈ చిత్రం చూడండి. టెక్కలిలోని భూగర్భగనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పాత కార్యాలయం సమీపంలో ఇసుక స్టాక్ పాయింట్ వెనక ఓ కేసులో సీజ్ చేసిన మూడు భారీ గ్రానైట్ బ్లాకులను ఉంచిన ప్రదేశమిది. 2022 మేలో కంచిలి నుంచి అక్రమ రవాణా చేస్తుండగా పట్టుకున్నారు. ఎన్నికలయ్యే వరకు అక్కడే ఉన్నాయి.



కూటమి ప్రభుత్వం వచ్చే ముందు వరకు సీజన్ చేసిన గ్రానైట్ బ్లాకులు ఉంచిన ప్రదేశం ప్రస్తుత పరిస్థితి ఇది. ఇప్పుడక్కడ గ్రానైట్ బ్లాకులు లేవు. ఎక్కడికెళ్లిపోయాయో తెలియదు. మిస్టరీ ఏంటో ఏ అధికారీ చెప్పడం లేదు.



ఆ బ్లాకులు ఏమయ్యాయో?

- రెండేళ్ల క్రితం పట్టుబడిన గ్రానైట్ బ్లాకులు
- అచ్చెన్న కుటుంబీకులకు చెందిన దుర్గాభవానీ గ్రానైట్ ఫ్యాక్టరీకి తరలిస్తున్నట్లు అప్పట్లో నిర్ధారణ
- సీజ్ చేసి టెక్కలి పాత మైనింగ్ ఏడీ కార్యాలయం సమీపంలో ఉంచిన అధికారులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక మాయమైన వైనం
- స్పష్టతనివ్వని అధికారులు



2022 మేలో అక్రమంగా రవాణా చేస్తుండగా బ్లాకులతో పట్టుబడిన వాహనం(ఫైల్)

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

పైన ఉన్న పాత, కొత్త చిత్రాలను చూస్తే ఎవరికైనా విషయం ఇట్టే అర్థమైపోతుంది. సీజ్ చేసిన బ్లాకులను కూటమి ప్రభుత్వం వచ్చాక తరలించుకుపోయినట్టు స్పష్టమవుతోంది. ఈ బ్లాకుల అక్రమ రవాణా వ్యవహారంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కుటుంబీకులకు చెందిన దుర్గాభవానీ గ్రానైట్ ఇండస్ట్రీపై కేసు నమోదైంది. ఇప్పుడా బ్లాకులు కన్పించకపోవడం చర్చనీయాంశమైంది. అధికారం అండతో తరలించుకుపోయారా? లేదంటే ఇంకెవరైనా పట్టుకువెళ్లారా? అన్నది సస్పెన్స్‌గా మారింది. సహజంగా కేసులో ఉన్న సంస్థపైనే అనుమానాలొస్తాయి. దీనిపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత సంబంధిత అధికారుల పైనే ఉంది.

కూటమి అధికారంలోకి వచ్చాక మిస్సింగ్..



ఎన్నికలయ్యేంత వరకు సీజ్ చేసిన బ్లాకులు అక్కడే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా కొన్ని రోజులు ఉన్నాయి. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు గానీ అక్కడున్న బ్లాకులు కనిపించడం లేదు. మైనింగ్ అధికారులను అడిగితే పోలీసు స్టేషన్‌కు అప్పగించామని, తమ పరిధిలో లేదని దాట వేస్తున్నారు. మొత్తానికి ఇప్పుడా బ్లాకులు మిస్సింగ్ అయినట్టు స్పష్టమవుతోంది. ఇప్పుడవి ఎక్కడికెళ్లాయో? ఎవరు తీసుకెళ్లారో ? తేల్చాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఒకవేళ అధికారులే ఎక్కడో భద్రంగా దాచి పెడితే ఫర్వాలేదు. లేదంటే ఉద్దేశపూర్వకంగా ఎవరో అక్రమంగా తరలించుకునిపోయినట్టు అవుతుంది. సహజంగానే ఆ బ్లాకుల విషయంలో కేసు నమోదైన ఉన్న దుర్గా భవానీ గ్రానైట్ ఫ్యాక్టరీపై అనుమానాలొస్తాయి. వాస్తవమేంటో చెప్పాల్సిన బాధ్యత అధికారుల పైనే ఉంది.

గతంలో ఏం జరిగిందంటే..

2022 మే 8న వచ్చిన సమాచారం మేరకు కంచిలి మండలం భైరీపురంలోని రానా గ్రానైట్ అండ్ మినరల్ క్వారీ నుంచి గ్రానైట్ బ్లాక్‌లను తరలిస్తున్న వాహనాన్ని(ఏపీ30టీఎ 1089) మైనింగ్, విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. ఆ సమయంలో గడువు దాటిన పర్మిట్‌తో అక్రమంగా తరలిస్తున్నట్టుగా గుర్తించారు. వాహనం సీజ్ చేశారు. దీనిపై మైనింగ్, విజిలెన్స్ అధికారులు లోతుగా విచారణ జరిపారు. పలాస దగ్గర ఉన్న టోల్ ప్లాజాలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా సదరు వాహనం నిర్దేశిత ట్రాన్సిట్ గడువు సమయంలో మూడు సార్లు లోడింగ్, అన్‌లోడింగ్‌తో అటు ఇటు వెళ్లినట్టు రికార్డయ్యింది. దీంతో ఒక ట్రాన్సిట్ ఫారంతో రెండు మూడు సార్లు గ్రానైట్ బ్లాక్‌ల అక్రమ తరలింపు జరిగినట్టు నిర్ధారించారు.

శ్రీదుర్గా భవానీ గ్రానైట్ ఇండస్ట్రీ గుట్టురట్టు

దీనివెనక ఎవరున్నారో అధికారులు తెలుసుకునేందుకు ప్రయత్నించారు. అందులో భాగంగా తమకున్న అనుమానాలతో బ్లాక్‌లు రవాణా జరిగిన అచ్చెన్నాయుడు ఫ్యామిలీకి చెందిన శ్రీ దుర్గాభవానీ గ్రానైట్ ఇండస్ట్రీని, అటు కంచిలిలో ఉన్న గ్రానైట్ క్వారీని పరిశీలించారు. ఇందులో దుర్గా భవానీ గ్రానైట్ ఇండస్ట్రీ ప్రమేయం ఉన్నట్టు గుర్తించారు. గ్రానైట్ బ్లాక్‌ల నంబర్లు దిద్దుబాటు చేయడం, నంబర్ల ట్యాంపరింగ్‌కు పాల్పడటం వంటివి చేసినట్టు నిర్ధారించారు. ఒకే నెంబర్‌తో పలు గ్రానైట్ బ్లాక్‌లను గుర్తించారు. ఆన్‌లైన్‌లో ఉన్నదానికి, భౌతికంగా ఉన్న బ్లాక్‌ల నిల్వల తేడాను సైతం నిగ్గు తేల్చారు. 172.87 క్యూబిక్ మీటర్ల బరువైన 23 బ్లాక్‌లకు సంబంధించి తేడాలు ఉన్నట్టు అధికారుల విచారణలో తేలింది. ఇవన్నీ భైరీపురంలోని రానా గ్రానైట్ క్వారీల నుంచి అక్రమంగా తరలించినట్టుగా భావించి అపరాధ రుసుంతో కలిపి వాటి విలువ రూ.6 కోట్లు ఉండొచ్చని అంచనా వేశారు.

కోటబొమ్మాళిలో కేసు నమోదు..

అచ్చెన్నాయుడు ఫ్యామిలీకి చెందిన శ్రీదుర్గా భవానీ గ్రానైట్ ఇండస్ట్రీలో ప్రభుత్వ ప్రోపర్టీ దొంగతనం, టాంపరింగ్, డూప్లికేషన్, ఉన్న స్థితిని మార్చడం వంటి అక్రమాలకు పాల్పడ్డారని ఆ ఇండస్ట్రీ మేనేజింగ్ డైరెక్టర్ అచ్చెన్నాయుడు సోదరుడు హరిప్రసాదరావు కుమారుడు సురేష్‌కుమార్, భాగస్వాములైన నాతూరాం చౌదరి, పొన్నాం దాలినాయుడు, పొన్నాం భాస్కరరావు, రావాడ మోహనరావుపై కోటబొమ్మాళి పోలీసు స్టేషన్‌లో శ్రీకాకుళం మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.బాలాజీనాయక్ అప్పట్లో ఫిర్యాదు చేశారు. దీంతో 379, 420, 477–ఎ, 406, 120బి, 34 ఐపీసీ సెక్షన్‌ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. సీజ్ చేసిన గ్రానైట్ బ్లాకులను టెక్కలి పాత మైనింగ్ ఏడీ కార్యాలయంలో సమీపంలో ఉంచారు.

గెలిచి తీరవలె..

బడుల్లో బల ప్రదర్శన

- స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో సీరియస్ పాలిటిక్స్
- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కూటమి నేతలు
- సార్వత్రిక ఎన్నికలపై అనుమానాలే కారణం
- కచ్చితంగా గెలిచి తీరాలని నాయకులకు టార్గెట్
- తేడా వస్తే పథకాలు నిలిపేస్తామని భయపెట్టాలని ఆదేశం



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికలపై ఉన్న సందేహాలు గతంలో ఎప్పుడూ రాలేదు. వీరికింత మెజారిటీలా అని చాలా మంది ముక్కున వేలేసుకున్నారు. అందుకు తగ్గట్టుగానే ఈవీఎంల ఓట్ల తేడాలు, ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ఓట్లలో భారీ తేడా ఉందని జాతీయ స్థాయిలో కథనాలు రావడంతో 2024 సార్వత్రిక ఎన్నికల్లో మాయాజాలం జరిగిందన్న వాదనలు నడుస్తున్నాయి. ఈ సమయంలో గురువారం జిల్లాలో 2267 పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ల ఎన్నికలు జరుగుతుండటంతో అధికార పార్టీ లకు సవాల్‌గా మారింది. ఈ ఎన్నికల్లో సత్తా చాటుకోకపోతే మొన్నటి ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు గాలివాటమని అనుకోవడానికి అవకాశం ఉందని కూటమి నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు.ఇప్పటికే ఎమ్మెల్యే, ఆస్థాయి నాయకులు మండల, గ్రామ స్థాయి నాయకులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎట్టి పరిస్థితుల్లోనూ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలన్నీ గెలుచుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా తేడా వస్తే ఇబ్బంది పడతారని, గ్రామ స్థాయిలో నాయకత్వాన్ని మార్చాల్సి వస్తుందని హెచ్చరికలు కూడా జారీ చేశారు. అవసరమైతే భయపెట్టండి.. పథకాలు ఆపేస్తామని బెదిరించండి...ఏదో ఒకటి చేయండి...కానీ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలన్నీ మనకే దక్కాలంటూ టార్గెట్ పెట్టారు. దీంతో కూటమి నాయకులు పాఠశాలల వారీగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తమనే ఎన్నుకోవాలని అడుగుతున్నారు. మరోవైపు ఉపాధ్యాయులపై కూడా ఒత్తిళ్లు చేస్తున్నారు. మనవాళ్లే గెలిచేలా చూడాలని సతాయిస్తున్నారు.



డయేరియాతో ఒకరి మృతి



అప్పలనాయుడు (ఫైల్)

- మెట్టవలసలో 73కు చేరిన బాధితుల సంఖ్య
- ఆందోళనలో గ్రామస్తులు



గ్రామస్తులకు ఇంటి వద్దే వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు

జి.సిగడాం: మండలం మెట్టవలసలో డయేరియా బారిన పడి గొర్లె చిన్న అప్పలనాయుడు(70) అనే వృద్ధుడు బుధవారం మృతి చెందాడు. ఈ నెల 4న విరేచనాలు, వాంతులు మొదలుకావడంతో వెంటనే 108 అంబులెన్సులో రాజాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో అదే రోజు సాయంత్రం శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకొచ్చి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఈయనకు నలుగురు పిల్లలు ఉన్నారు. మరోవైపు డయేరియా బాధితుల సంఖ్య 73కు చేరింది. వీరిలో 34 మంది శ్రీకాకుళం, రాజాం, పొందూరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. 28 మంది గ్రామంలోనే వైద్యం చేయించుకుంటున్నారు. వీరికి స్థానిక వైద్యాధికారులు బుడుబూరు యశ్వంత్, పేకల సుమబిందు, సిబ్బంది వైద్యసేవలు అందిస్తున్నారు. మరోవైపు, గ్రామంలో అతిసార ప్రబలడానికి అధికారులు స్పష్టమైన కారణాలు వెల్లడించకపోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

విరాళాలకు విరామం

'అమరావతి' వసూళ్లపై యూటర్న్

- కుదిపేసిన 'సాక్షి' కథనం
- 'విరాళాల ముసుగులో వసూళ్ల పర్వం' కథనంతో వెనకడుగు
- తక్షణమే వసూలు ఆపేయాలని బ్యాంకు లింకేజీ అధికారి ఆడియో మెసేజ్

'అమ్మా..గ్రూపులో ఉన్న లీడర్స్ అందరికీ తెలియజేయండి ఏమనగా.. మనకి అమరావతి రాజధాని నిర్మాణానికి ప్రతీ సభ్యురాలి నుంచి రూ.100 కలెక్ట్ చేయమని చెప్పారు. ఆ వంద రూపాయలు గ్రూపులో ఎంతమంది సభ్యులుంటే అన్ని వందలు మన ఎస్ఎల్ఎఫ్ అకౌంట్‌కి ఇవ్వాలి. ఎస్ఎల్ఎఫ్ అకౌంట్ నుంచి టీఎల్ఎఫ్ అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ పెడతాం. టీఎల్ఎఫ్ అకౌంట్ నుంచి కలెక్టర్ అకౌంట్‌కి ట్రాన్స్‌ఫర్ పెడతారు. ఆగస్టు 15లోగా పూర్తవ్వాలి. 12లోగా ప్రతీ సభ్యురాలి నుంచి రూ.100 ఇవ్వమని చెప్పారు. అమరావతి నిర్మాణానికి ప్రతీ సభ్యురాలు రూ.100 చొప్పున విరాళాలు ఇవ్వాలని ఇప్పుడే మాకు మీటింగ్ పెట్టి చెప్పారు. చాలా మంది ఈ నెల పొదుపులు అన్నీ కలెక్ట్ చేస్తారు. చేసినప్పుడు రూ.100 అడగండి. ముందే కలెక్ట్ చేసినట్టయితే లోన్ కట్టాల్సిన సొమ్ము నుంచి సభ్యురాలికి రూ.100 చొప్పున లీడర్ తీసి, నాకు ఇస్తే రశీదు ఇస్తాను. మళ్లీ నెల మీటింగ్‌లో వారికి చెప్పి కలెక్షన్ చేసి అప్పులో వేసుకుందాం. అందుకే మరిచిపోకుండా రెండు రోజుల్లో ప్రతీ సంఘం నుంచి అమౌంట్ ఇవ్వాలి. నేను ఎస్ఎల్ఎఫ్ నుంచి టీఎల్ఎఫ్‌కు ట్రాన్స్‌ఫర్ పెట్టాలి. మరీ మరీ చెబుతున్నాను ప్రతీ సభ్యురాలి నుంచి రూ.100 ఇవ్వాలి. – శ్రీకాకుళం నగరంలోని సంఘ సభ్యుల వాట్సాప్ గ్రూప్‌లో మంగళవారం రాత్రి 9.30 గంటల సమయంలో రిసోర్స్‌పర్సన్ పెట్టిన ఆడియో క్లిప్పింగ్‌లో సారాంశమిది.

'ఆర్‌పీలందరికీ ముఖ్య గమనిక. పీడీ ఆదేశాల మేరకు రాజధాని విరాళాలకు సంబంధించిన సంఘ సభ్యుల నుంచి వసూలు చేసిన రూ.100 ఏదైతే ఉందో ఎక్కడిది అక్కడ ఆపేయండి. ఆల్రెడీ వసూలు చేసి ఉంటే ఉంటే మీ దగ్గర క్యాష్ ఇన్ హేండ్‌లో లేకుండా చూసుకోండి. సంఘం నుంచో, సమాఖ్య నుంచో తీసినట్టయితే వాటిలో వేసి స్టాప్ చేయండి.. ఫీల్డ్ నుంచి కంప్లైంట్ రాకుండా చూసుకోండి.

–బ్యాంకు లింకేజీ అధికారి రిసోర్స్ పర్సన్స్‌కు పెట్టిన వాట్సాప్ ఆడియో క్లిప్పింగ్ సారాంశమిది.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

అమరావతి రాజధాని కోసం 'విరాళాల ముసుగులో వసూళ్ల పర్వం' శీర్షికన 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన కథనం అధికార వర్గాలను కుదిపేసింది. రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఎవరైనా విరాళాలు ఇవ్వాలనుకుంటే ఉదారతతో ఇవ్వాలే తప్ప బలవంతంగా డ్వాక్రా మహిళల నుంచి వసూలు చేయడం సరికాదని సర్వత్రా నిరసన వ్యక్తమైంది. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతోనే ఇదంతా జరిగినట్టు చర్చకు తావిచ్చింది. ప్రజల దగ్గర చందాలు వసూలు చేసి, రాజధాని నిర్మిస్తారా? ఎవరికి పనికొచ్చిన రాజధాని కోసం ఇదంతా చేస్తున్నారనే చర్చ జరిగింది. 'సాక్షి'లో వచ్చిన కథనంతో ప్రభుత్వంపై వ్యతిరేకత రావడంతో ఉన్నతస్థాయి వర్గాలు స్పందించాల్సి వచ్చింది. ఆ ఆదేశాల మేరకు జిల్లా అధికార వర్గాలు కూడా స్పందించి ఎక్కడికక్కడ విరాళాల కింద వసూలు చేస్తున్న దానిని ఆపేయాలని వాట్సాప్ గ్రూపుల్లో ఆడియో మెసేజ్‌లు పెట్టారు. వసూళ్ల వ్యవహారాన్ని తాత్కాలికంగా ఆపుతున్నారా? లేదంటే పూర్తిగా ఆపేస్తారా? అన్నది చూడాల్సి ఉంది.



సాక్షిలో ప్రచురితమైన కథనం

విరాళాలపై బుకాయింపు..

కుప్పంలోని డ్వాక్రా మహిళలంతా స్వచ్ఛందంగా అమరావతి రాజధాని కోసం విరాళాలు ఇచ్చారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని ఇక్కడి డ్వాక్రా మహిళలు ముందుకొచ్చి విరాళాల సేకరణ చేస్తున్నారని అధికార వర్గాలు విచిత్రకరమైన వివరణ ఇచ్చాయి. అలాంటప్పుడు ప్రతీ సభ్యురాలు తప్పకుండా రూ.100ఇవ్వాలని అడగడమేంటి? ఎందుకు...ఏంటీ ? అని అడగొద్దని చెప్పడమేంటి? పీడీ ఆదేశాలతో మళ్లీ ఆ విరాళాల సేకరణ ఆపమని చెప్పడమేంటి? ఇదంతా చూస్తే అధికారులకు తెలియకుండా, అధికారులు చెప్పకుండా డ్వాక్రా మహిళలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ప్రతీ ఒక్కరూ రూ.100 ఇస్తున్నారని అనుకుంటే పప్పులో కాలేసినట్టే. గంటల వ్యవధిలోనే వాట్సాప్ ఆడియో మెసేజ్‌ల ద్వారా డ్వాక్రా సంఘాలను అప్రమత్తం చేయడం దేనికి సంకేతమో అధికార వర్గాలే చెప్పాలి. సీఎఫ్‌లకు ప్రత్యేక సమావేశం పెట్టి ఇక్కడితో ఇదంతా ఆపేయాలని చెప్పడం దేంట్లో భాగమో వారికే తెలియాలి.





క్లుప్తంగా

ఇసుక లారీ పట్టివేత



పట్టుబడిన లారీ

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని గ్రామ రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. బుధవారం ఉదయం గార నుంచి బైరి, సింగుపురం మీదుగా వెళ్తుండగా ఈ లారీని పట్టుకొని సేఫ్ సైడ్ కస్టోడియన్ నిమిత్తం శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ దాడుల్లో బైరి, కరజాడ, పొన్నాం, బట్టేరు వీఆర్వోలు గణేష్, పాపారావు, యశ్వంత్ పాల్గొన్నారు.

వ్యక్తిపై టీడీపీ కార్యకర్త దాడి

శ్రీకాకుళం రూరల్: మండలంలోని సానివాడకు చెందిన యడ్ల శ్యామ్‌సుందర్‌పై అదే గ్రామానికి చెందిన మద్దిల శ్రీను అనే టీడీపీ కార్యకర్త మంగళవారం దాడికి పాల్పడ్డాడు. వీరిద్దరికీ కొంతకాలంగా రాజకీయ విభేదాలు ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే శ్యామ్‌సుందర్‌పై శ్రీను కత్తితో దాడికి పాల్పడ్డాడు. గాయాలపాలైన శ్రీనును వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అవుట్ పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వలియాసాగరంలో వైద్య శిబిరం




వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ పవన్ తేజ

టెక్కలి రూరల్: గత కొద్ది రోజులుగా వలియాసాగరం గ్రామంలో పలువురు జ్వరాల బారిన పడుతుండటంతో 'వలియాసాగరంలో జ్వరాల విజృంభణ' అనే శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. బుధవారం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. లింగాలవలస పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పవన్ తేజ ఆధ్వర్యంలో వైద్య బృందం ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం పంచాయతీ సిబ్బంది సహాయంతో గ్రామంలో క్లోరినేషన్ పనులు చేయించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి జి.కూర్మనాయుకులు, విస్తరణ అధికారి ఎ.అప్పారావు, వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒడియా సీఆర్‌టీలను నియమించాలి

కవిటి: ఒడియా గిరిజన పిల్లల కోసం ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న ఒడియా మాధ్యమం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలలో నియమించిన తెలుగు సీఆర్‌టీలను తొలగించి ఒడియా సీఆర్‌టీలను నియమించాలని అపోటా నేతలు కోరారు. ఈ మేరకు బుధవారం ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బి.అశోక్‌ను రామయ్యపుట్టుగలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఒడియా మాధ్యమ మైనార్టీ గిరిజన విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

జలపాతాన్ని తలపించేలా..



పాత హిరమండలం వయోడెక్ట్ వద్ద వంశధార' పరవళ్లు తొక్కుతోంది. ఖరీఫ్ నేపథ్యంలో కుడి ప్రధాన కాలువకు నీటిని విడిచిపెట్టడంతో నీటి ప్రవాహం అధికం కావడంతో జలపాతాన్ని తలపిస్తోంది. 648 క్యూసెక్కుల నీటి ప్రవాహానికి ఇలా ఉంటే.. భారీ వర్షాలు పడితే పరిస్థితి ఎలా ఉంటుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

- హిరమండలం

మోస్తరు వర్షానికే ముంపు



జిల్లా కేంద్రానికి మురుగునీటి ముంపు సమస్య వీడటం లేదు. శ్రీకాకుళం నగరంలో బుధవారం కురిసిన మోస్తరు వర్షానికే పలుచోట్ల రోడ్లు జలమయమయ్యాయి. పాతబస్టాండ్ నుంచి అరసవల్లి వెళ్లే దారి వర్షపు నీరు, మురుగు నీటితో నిండిపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. ఎప్పుడు వర్షమొచ్చినా ఇదే పరిస్థితి ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

ద్విచక్ర వాహనానికి నిప్పు



పలాస మండలం బ్రాహ్మణతర్ల గ్రామంలో ద్విచక్ర వాహనాన్ని నిప్పంటించిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గరిక ధర్మారావు తన ద్విచక్రవాహనాన్ని హైస్కూల్ రోడ్డులోని చెరువు గట్టు వద్ద బుధవారం పార్కింగ్ చేశాడు. రాత్రివేళ గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో బైకు దగ్ధమైంది. తెలుగుదేశం పార్టీకి చెందిన వారే ఈ ఘటనకు పాల్పడ్డారని బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. సీఐ విజయ్‌ఆనంద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- కాశీబుగ్గ

సిక్కోలు చేనేతకు ప్రత్యేక గుర్తింపు



రాట్నం వడుకుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం: జిల్లాలోని చేనేత వస్త్రాలకు ప్రత్యేక గుర్తింపు ఉందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. చేనేత, జౌళి శాఖ, సిక్కోలు వీవర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఆధ్వర్యంలో 10వ జాతీయ చేనేత దినోత్సవం కార్యక్రమం బుధవారం శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో నిర్వహించారు. ముందుగా వస్త్ర ప్రదర్శన, రాట్నం, వస్త్ర తయారీ విధానాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ చేనేత పరశ్రమ లాభసాటిగా ముందుకు సాగాలంటే మార్కెటింగ్ కీలకమని చెప్పారు. వినియోగదారుల అభిరుచులకు తగ్గ వస్త్రాలు తయారు చేయాలన్నారు. వ్యవసాయం తరువాత దేశంలో ఎక్కువ మంది చేనేత, జౌళి రంగంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పారు. పొందూరు ఖాదీకి ప్రపంచ స్థాయి గుర్తింపు ఉందన్నారు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి డిజిటల్ షాపింగ్ యాప్‌ల ద్వారా అమ్మకాలు చేస్తే ఎక్కువ మందికి చేనేత వస్త్రాలు చేరువ అవుతాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ముద్ర రుణాలను చేనేత కార్మికులు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం చేనేత కళాకారుడు ముచ్చా శ్రీనివాసరావును సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు ఎస్.శ్రీదేవి, హర్షవల్లి, చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకులు సాయిప్రసాద్, నాబార్డు డీడీ రమేష్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'శిష్టకరణ ఓబీసీ సాధన'కు కదలిరండి



మాట్లాడుతున్న శిష్టకరణ జాతీయ కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస పట్నాయక్

శ్రీకాకుళం పీఎన్ కాలనీ: శ్రీకాకుళం నగరంలోని శిష్టకరణ కల్యాణ మండపంలో బుధవారం శిష్టకరణ ఓబీసీ సాధన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ శిష్టకరణ రాష్ట్ర అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కులపెద్దల సహకారంతో రాష్ట్రంలో అన్ని జిల్లాల కమిటీ నాయకుల సమష్టి కృషితో ఓబీసీ సాధనకు కృషి చేస్తామన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 9 నుంచి 12వ తేదీల మధ్య ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలవనున్నామని, శ్రీకాకుళం నుంచి పెద్ద ఎత్తున నాయకులు కదిలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ జాతీయ కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్, జిల్లా అధ్యక్షుడు డబ్బీరు శ్రీనివాసరావు, విశాఖ అధ్యక్షుడు గొడవ ప్రభాకర్‌దాస్, బద్రి మహంతి, వెంకటరావు, డబ్బీరు సత్యప్రసాద్, మురళి, శర్మ, బెహరా రామచంద్రారావు తదితరులు పాల్గొన్నారు.

నేత కార్మికులకు ప్రధాని అభినందనలు



మోదీకి చేనేత వస్త్రాన్ని బహూకరిస్తున్న ఎంపీ అప్పలనాయుడు

రణస్థలం: జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మోదీ చిత్రంతో కూడిన చేనేత వస్త్రాన్ని ఢిల్లీలో బహూకరించారు. లావేరు మండల కేంద్రానికి చెందిన చేనేత కార్మికులు బాసిన నాగేశ్వరరావు, లక్ష్మీ దంపతులు మూడు అడుగుల వెడల్పు, ఆరడుగుల పొడవు గల వస్త్రంపై 40 రోజులపాటు శ్రమించి ఈ వస్త్రాన్ని తయారు చేశారు. ఈ సందర్భంగా ప్రధాని చేనేత కార్మికులకు అభినందనలు తెలిపినట్లు ఎంపీ చెప్పారు.

సమన్వయంతో పనిచేస్తే మెరుగైన 'ఉపాధి'



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉపాధి హామీ పథకం సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే గ్రామాల్లో స్థిరాస్తులు, మౌలిక సదుపాయాలు ఏర్పడతాయని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు అన్నారు. బుధవారం జిల్లా కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఆగస్టు 15నఅన్ని అమృత్ సరోవర్ చెరువుల వద్ద జాతీయ జెండా ఎగరవేయాలని సూచించారు. విజిలెన్స్ అధికారి బి.లవరాజు మాట్లాడుతూ సామాజిక తనిఖీ రికవరీలను తక్షణమే చెల్లించాలన్నారు.సమావేశంలో ఫైనాన్స్ మేనేజర్ స్వరూపరాణి, ఏపీడీలు మురళీకృష్ణ, శైలజ, పి.రాధ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో జాబ్‌మేళా రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: బలగ హాస్పిటల్ జంక్షన్‌లోని డీఎల్‌టీసీ/ప్రభుత్వ ఐటీఐ శిక్షణా సంస్థలో ఈ నెల 9న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ఎల్ జిందాల్‌లో హెల్పర్స్ పోస్టులకు, కేవీ హ్యూమన్ రిసోర్సెస్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో సీనియర్ అసిస్టెంట్, డేటాఎంట్రీ ఆపరేటర్, బేటరీ ఆపరేటర్ తదితర పోస్టుల భర్తీకి జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జిందాల్‌లో పోస్టులకు 18 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగి 8వ తరగతి నుంచి ఐటీఐ వరకు చదివిన పురుషులు అర్హులని పేర్కొన్నారు. 100 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఎంపికైనవారు నల్గొండ జిల్లా నార్కెట్‌పల్లిలో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. కేవీ హ్యూమన్ సంస్థ పోస్టులకు 18 నుంచి 50 ఏళ్ల వయసు కలిగి టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ చదువుకున్న పురుషులు అర్హులని పేర్కొన్నారు. 572 పోస్టులు ఖాళీ ఉన్నాయని, ఎంపికైనవారు సంగారెడ్డి జిల్లా ఎలమంచిలిలో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు ధ్రువపత్రాలతో శుక్రవారం ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు.

విద్యార్థుల్లో సేవా దృక్పథం అవసరం



మాట్లాడుతున్న వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు సేవా దృక్పథం పెంచుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజని అన్నారు. వర్సిటీ సెమినార్ హాలులో బుధవారం జిల్లా విద్యా సంస్థల జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) ప్రోగ్రాం అధికారులలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం, ఆరోగ్యం, బహిరంగ మల విసర్జన వల్ల కలిగే నష్టాలు వంటి అంశాలపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. విద్యార్థులు ఎన్ఎస్ఎస్‌లో చేరేందుకు ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, జాతీయ సేవా పథకం జిల్లా సమన్వయకర్త ఎం.అనురాధ పాల్గొన్నారు.

రీ వాల్యుయేషన్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని 2019 బ్యాచ్ పూర్వపు 3, 5 సెమిస్టర్ల రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల చేసినట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ బుధవారం తెలిపారు. వర్సిటీ వెబ్‌సైట్‌లో ఫలితాలను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. డిగ్రీ ఐదో సెమిస్టర్ 2020-21 బ్యాచ్ రీ వాల్యుయేషన్ ఫలితాలు కూడా విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఫలితాలు జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంచామన్నారు. వర్సిటీ పరిధిలోని పోస్టు గ్రాడ్యుయేషన్ నాలుగో సెమిస్టర్ ఫలితాలను గురువారం విడుదల చేస్తామని డీన్ చెప్పారు.

నవోదయ ప్రవేశాలకు ఆహ్వానం



డి.పరశురామయ్య, నవోదయ ప్రిన్సిపాల్

శ్రీకాకుళం న్యూకాలనీ: జవహర్ నవోదయ విద్యాలయం(జేఎన్‌వీ)లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి ప్రవేశాలకు ఇప్పటికే నోటిఫికేషన్ వెలువడిందని.. 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని వెన్నెలవలస నవోదయ ప్రిన్సిపాల్ దాసరి పరశురామయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 18న జరిగే ఈ పరీక్షకు అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 16 లోపు http://navodaya.gov.inఅనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2013 మే 1 నుంచి 2015 జులై 31 మధ్య జన్మించిన వారు అర్హులని స్పష్టంచేశారు. పూర్తి వివరాలకు జేఎన్‌వీ వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఆటో ఢీకొని వృద్ధుడి మృతి



శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని అరసవెల్లి పంతులు వీధి సమీపంలో ఆదిత్యానగర్ కాలనీ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. అరసవల్లి సెగిడి వీధికి చెందిన బూరవెల్లి గణేష్ (65) రాత్రి 8 గంటల సమయంలో టిఫిన్ చేసేందుకు ఆదిత్యనగర్ కాలనీకి చేరుకున్నాడు. అదే సమయంలో కిష్టప్పపేటకు చెందిన ఆటో డ్రైవర్ పీటవ రామారావు శ్రీకూర్మం నుంచి వస్తూ వృద్ధున్ని ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని అదే ఆటోలో రిమ్స్‌కు తీసుకెళ్లారు. వైద్యులు చికిత్స ప్రారంభించిన కొద్ది నిమిషాల్లోనే వృద్ధుడు చనిపోయాడు. గణేష్‌కు వివాహమైన ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య నరసమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ ఎస్ఐ సందీప్ కేసు నమోదు చేశారు.

సాధనతోనే మెరుగైన ప్రదర్శన



సాఫ్ట్‌బాల్ సాధనలో క్రీడాకారులు

ఎచ్చెర్ల క్యాంపస్: క్రీడల్లో నిరంతర సాధనతోనే మెరుగైన ప్రదర్శన ఇవ్వవచ్చని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కన్వీనర్ కలిదిండి వెంకటరామరాజు అన్నారు. రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే జిల్లా జట్టుకు కేశవరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం ప్రత్యేక శిక్షణ శిబిరం ప్రారంభించారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఈ నెల 17, 18 తేదీల్లో రాష్ట్రస్థాయి టోర్నీ జరగనుంది. సన్నాహకాల్లో భాగంగా క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మెట్ట తిరుపతిరావు, పీడీ మొజ్జాడ వెంకటరమణ, పీఈటీలు జి.మల్లేష్, మధు, ఉపాధ్యాయులు జగదీష్, దుర్గాప్రసాద్, కోచ్‌లు పాల్గొన్నారు.

పాముకాటుకు వృద్ధుడి మృతి



అభిమన్యు దోళాయ్ మృతదేహం

మెళియాపుట్టి: మండలంలోని గంగరాజపురం గ్రామానికి చెందిన అభిమన్యు దోళాయ్ (64) మంగళవారం పొలం పనులు చేస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు పర్లాఖిమిడి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మరణించాడు. అభిమన్యుకు భార్య కుంతి, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
Union Bank of India
రీజనల్ ఆఫీస్, ఇంటి నెం.8, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బిల్డింగ్, సింహ ద్వారం దగ్గర, వెంకటాపురం, శ్రీకాకుళం. ఫోన్ : 08942-270919

బంగారు నగల వేలం ప్రకటన

ఈ క్రింద ఉదహరించిన ఖాతాదారులు మా బ్యాంకు నందు బంగారు నగలు తనఖా పెట్టి అప్పు తీసుకొని తిరిగి చెల్లించమని నోటీసులు పంపించినను తిరిగి చెల్లించని కారణంగా బ్యాంకు నిబంధనల ప్రకారం తేది.23.08.2024 శుక్రవారం ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 2.00 గం॥ల వరకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి బ్రాంచి ఆవరణలలో బహిరంగ వేలం వేయబడును. వేలం వేయగా వచ్చిన సొమ్ముతో సదరు అకౌంటు పూర్తిగా చెల్లుబాటు కాని యెడల వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకొని మిగిలిన బకాయి వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలిపి వసూలు చేయబడును. ఈ దిగువ ఖాతాదారులు ఎవరైనా మరణించిన ఎడల వారి వారసులకు ఈ వేలం నోటీసు వర్తిస్తుంది. అప్పు నోటీసులు అందని వారికి మరియు నోటీసులను తిరస్కరించిన వారికి పత్రికా ముఖమున చివరిసారిగా ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

క్ర.స	బ్రాంచి పేరు	ఋణగ్రహీతల పేరు	ఖాతా నెం॥.	ఎన్‌పిఏ తేది
1)	అరసవల్లి బ్రాంచ్	శ్రీ తమద వైకుంఠం, తండ్రి. లేటు రామారావు, డి.నెం.సి2-28, ఆదిత్య నగర్ కాలనీ, అరసవల్లి, శ్రీకాకుళం జిల్లా, అం.ప్ర-532401.	211116630000166	02.04.2024
2)	బలగ బ్రాంచ్	శ్రీ గుప్త రేవంత్ కుమార్, తండ్రి. ధర్మ రాజు, నెం.9-8-4, ఆదిత్య స్కూల్ ఎదురుగా, గుడి వీధి, శ్రీకాకుళం-532001.	174316540004650	29.05.2024
3)	బొరిగివలస బ్రాంచ్	శ్రీమతి ముద్దాడ శ్రావణి, C/o ముద్దాడ సోమేశ్వర రావు, ఇంటి నెం.7-29, సెగిడి వీధి, నరసన్నపేట గ్రామం, శ్రీకాకుళం జిల్లా, అం.ప్ర-532421.	296416540001754	02.03.2024
4)	కొత్తూరు బ్రాంచ్	శ్రీ యార్లంకి రామకృష్ణ, తండ్రి. తెల్లయ్య, ఇంటి నెం.1-43, అల్లు వీధి, కొత్తూరు, శ్రీకాకుళం, అం.ప్ర-532455.	174716540004793	25.03.2024
			174716540005715	25.03.2024
			174716540005716	25.03.2024
5)	కొత్తూరు బ్రాంచ్	శ్రీ కూన అప్పల నాయుడు, తండ్రి. లేటు కేశవయ్య, 3-120, అఫీషియల్ కాలనీ, కొత్తూరు, కాశీమ్మ, శ్రీకాకుళం జిల్లా, అం.ప్ర-532455.	174716540005194	16.05.2024
			174716630000639	16.05.2024
6)	RCB శ్రీకాకుళం బ్రాంచ్	శ్రీమతి నక్కా రాజేశ్వరి, భర్త. ఎస్. యర్రయ్య, ఇంటి నెం.3-245, చిన్న కొంగరం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం, అం.ప్ర-532001.	071116540001667	15.04.2024
			071116540001668	15.04.2024
7)	UMFB శ్రీకాకుళం బ్రాంచ్	శ్రీ నేదూరి రాజారావు, C/o. ఎన్. నారాయణమ్మ, డి.నెం.6-27, ఇందిరా నగర్ కాలనీ, శ్రీకాకుళం, అం.ప్ర-532001.	051316540001479	29.01.2024

నియమ నిబంధనలు : 1) వేలంలో పాల్గొనువారు రూ.5,000/- (అక్షరాల ఐదు వేల రూపాయలు మాత్రమే) ధరావత్తు చెల్లించవలెను. 2) వేలంలో సఫలీకృతం అయిన బిడ్డరు ధరావత్తు సొమ్ము మినహా మిగిలిన సొమ్మును వెంటనే చెల్లించి ఆభరణములను పొందవలెను. వేలంలో సఫలీకృతం కాని బిడ్డరు వారికి ధరావత్తు సొమ్ము వేలం అనంతరం తిరిగి చెల్లించబడును. 3) వేలంలో పాడిన సొమ్మును అంగీకరించుటకు లేక తిరస్కరించుటకు బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. 4) ఏ స్థితిలోనైనా వేలం రద్దు చేయుటకు గాని, నిలుపుదల చేయుటకు గాని, నియమ నిబంధనలు మార్చుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. 5) బిడ్ సొమ్ము పై జి.ఎస్.టి. సొమ్ము అదనము.

తేది : 07.08.2024, స్థలం : శ్రీకాకుళం సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

పీజీ కౌన్సెలింగ్‌కు వేళాయె

- జిల్లాలో అందుబాటులో 16 కోర్సులు.. 1115 సీట్లు
- వెబ్ఆప్షన్ల నమోదు ప్రారంభం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

ఎచ్చెర్ల క్యాంపస్:

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ ప్రవేశాలకు సంబంధించిన ఏపీ పీజీసెట్- 2024 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఉన్నత విద్యా మండలి విడుదల చేసింది. జూన్ 10 నుంచి 13 వరకు ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. విద్యార్థులు తమ ర్యాంకు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ఆన్‌లైన్‌లో వెబ్‌ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 16 పీజీ కోర్సుల్లో 559 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వర్సిటీ అనుబంధంగా ఏడు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో మరో 556 సీట్లు ఉన్నాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం మహిళల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సైతం పీజీ కోర్సులు నిర్వహిస్తున్నాయి. ఈ నెల 12 వరకు విద్యార్థులు ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. పీజీ సెట్‌లో ర్యాంకు సాధించిన వారు మాత్రమే అర్హులు. వీరికి మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుంది. పూర్తి వివరాలకు ఏపీఎస్‌హెచ్‌ఈ.ఏపీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

ఆప్షన్లు ఇచ్చుకోవాలి..

షెడ్యూల్ మేరకు ఈ నెల 12లోపు ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. పీజీ సెట్ అర్హత సాధించిన విద్యార్థులు కౌన్సెలింగ్ సద్వినియోగం చేసుకోవాలి. వర్సిటీ, అనుబంధ కళాశాల్లో పీజీ కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

- పి.సుజాత, రిజిస్ట్రార్, బీఆర్ఏయూ

అంబేడ్కర్ వర్సిటీలో సీట్లు ఇలా..

కోర్సు	సీట్లు
ఎకనామిక్స్	40
ఇంగ్లీష్	40
రూరల్ డెవలప్‌మెంట్	40
సోషల్ వర్కు	40
తెలుగు	40
ఎంకాం	40
ఎంఈడీ	40
ఎంఎల్ఐఎస్సీ	40
అప్లైడ్ మ్యాథ్స్	22
అనలాటికల్ కెమిస్ట్రీ	22
ఆర్గానిక్ కెమిస్ట్రీ	33
బయోటెక్నాలజీ	30
ఫిజిక్స్	40
మ్యాథ్స్	40
మైక్రోబయోలజీ	22
ఎంజేఎంసీ	30

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ B.A; B.Com, B.Sc, B.Lisc, BBA; M.A; M.Com; M.Sc; M.Lisc; MSW కోర్సుల డిస్టెన్స్ మరియు రెగ్యులర్ కొరకు సంప్రదించండి. శ్రీవాని డిగ్రీ కళాశాల - డే & నైట్ జంక్షన్, శ్రీకాకుళం. ఫోన్ : 99893 64332, 85009 60827 [V- 2653]

SERVICES
■ వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ మరియు వ్యక్తిగత కోసం అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సెల్: 9501065342 [T-269]

WANTED
■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను జీ:15 వేలు-40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం. HYD. Ph: 8317512135 [HA-98107]
■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటిపనికి / వంట పనికి వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 20K. ఫోన్: 8977639662, 8977639663 [H-796188]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.